

కెనాల్‌ను ఆక్రమించేశారు.. 2



పతంగుల దుకాణాల తనిఖీ 2



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

13-1-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## మహిళలకు ముగ్గుల పోటీలు..



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణ పద్మశాలి సంఘం, మహిళా సంఘం సంయుక్తంగా సంక్రాతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. పట్టణంలోని నాగలింగేశ్వర మందిర్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. సుమారు 40 మంది మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలి అధ్యక్ష, కార్యదర్శులు మ్యాక మోహన్ దాస్, కొక్కుల రమాకాంత్, లోకం విజయ, చిల్క లావణ్య, దోపతి భాగ్య, పొలాస లలిత, చౌకే సుశీల, చిలివేరి లక్ష్మి, బండి రాజు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే ధన్‌పాల్



**అక్షరటుడే, ఇందూరు:** ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ఇలా త్రిపాఠిని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్‌తో చర్చించారు. జిల్లా అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. తన పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు.

## కేకేవై రహదారిపై చిరుత కలకలం



**అక్షరటుడే, లింగంపేట:** కేకే వైరహదారిపై ఎల్లారెడ్డి – లింగంపేట అటవీ ప్రాంతంలో చిరుత సంచారం కలకలం రేపింది. మంగళవారం తెల్లవారు 3:30 గంటలకు లింగంపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాజిద్ ఖాన్ ఎల్లారెడ్డి నుంచి లింగంపేటకు వస్తుండగా మెంగారం అటవీ ప్రాంతంలో చిరుత రోడ్డుపైకి రావడంతో కారును నిలిపి వేసుకున్నట్లు తెలిపారు. ఈ రోడ్డుపై వానచోదకులు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. నెల రోజులుగా చిరుత రోడ్డుపై కనబడుతుండడంతో వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీ శాఖ సిబ్బంది ఇప్పటివరకు గుర్తులు గాని, బోర్డులు ఏర్పాటు చేయలేదు. కేకేవై రహదారిపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కావున అటవీశాఖ సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

# దావత్ పాలిటిక్స్!

జిల్లాలో మున్సిపల్ ఎన్నికల సందడి మొదలైంది. త్వరలో ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధం కావడంతో టికెట్ కోసం ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో తమకే టికెట్ వస్తుందని నమ్మకం ఉన్నవారు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. సంక్రాంతి పండుగను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వార్డు పరిధిలోని ఓటర్లకు దావత్‌లు ఇస్తున్నారు. - అక్షరటుడే, కామారెడ్డి



- ఆశావహులకు కలిసొచ్చిన సంక్రాంతి
- విందులతో ఓటర్లను మచ్చిక చేసుకునే యత్నం
- పండుగ రోజు మటన్, చికెన్ పంపిణీకి ఏర్పాట్లు
- మహిళలకు రంగుల డబ్బాలు పంపిణీ

మున్సిపల్ ఎన్నికలకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేయడంతో మున్సిపాలిటీల్లో ఎన్నికల వేడి రాజుకుంది. ఆశావహులు ప్రజలను తమవైపు తిప్పుకొనేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఈ అవస్థలు పడే క్రమంలో న్యూ ఇయర్ వేడుకలు ఆశావహులకు అవకాశంగా దొరికింది. కొత్త సంవత్సర వేడుకలకు యువతను తమవైపు తిప్పుకొనేందుకు దావత్‌లు ఏర్పాటు చేశారు. యువత న్యూ ఇయర్ వేడుకలకు అయ్యే ఖర్చు మొత్తం పోటీ చేసే అభ్యర్థులే భరించుకున్నారు. న్యూ ఇయర్ వేడుకల నుంచి దావత్‌ల పరంపర ప్రతిరోజు కొనసాగుతూనే ఉంది.

### రంగు డబ్బాలు పంపిణీ

కామారెడ్డి పట్టణంలోని పలు వార్డుల్లో ఆశావహులు ముందస్తుగా ప్రజల్లోకి వెళ్తున్నారు. ఈ క్రమంలో సంక్రాంతి వారికి కలిసొచ్చింది. పండుగను తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. పండుగ రోజు మహిళలు తమ ఇళ్ల ముందు ముగ్గులు వేస్తారు. దీంతో వారికి అవసరమయ్యే ముగ్గులు, రంగులను ప్రత్యేక డబ్బాలలో ప్యాక్ చేసి ఇంటింటికి పంపిణీ చేస్తున్నారు.

### సుక్క, ముక్క అందించేందుకు..

మున్సిపాలిటీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కౌన్సిలర్ అభ్యర్థులు పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. న్యూ ఇయర్ వేడుకల తర్వాత సంక్రాంతి పండుగ అభ్యర్థులకు మంచి అవకాశాన్ని కల్పించిందన్న టాక్ వినిపిస్తోంది. పండుగ రోజు వార్డులలో ప్రతి ఇంటికి సుక్క, ముక్క పంపిణీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పండుగ రోజు ఉదయాన్నే ప్రతి ఇంటికి మటన్, చికెన్‌తో పాటు మందు సరఫరా చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దాంతో ఈ సారి ఓటర్లకు పండుగ ఖర్చులు మిగిలిపోనున్నాయి.

### ఖర్చుకు వెనుకాడని అభ్యర్థులు

ఈ సారి మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్లుగా గెలుపొందాలన్న పట్టుదలతో పలువురు అభ్యర్థులు ఉన్నారు. ఈ క్రమంలో ఓటర్లకు కావాల్సిన వాటిని సమకూర్చేందుకు ఖర్చుకు వెనుకాడడం లేదు. లక్షలాది రూపాయలు ఇప్పటికే ఖర్చు చేసిన అభ్యర్థులు పోలింగ్ నాటికి మరింత ఖర్చు చేయడానికి సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా యువతను తమవైపు తిప్పుకొనేందుకు ఏదో ఒక ఆఫర్ చేస్తూనే ఉన్నారు. అయితే వార్డుల రిజర్వేషన్ ఇంకా ఖరారు కాలేదు. దీంతో భారీగా ఖర్చు చేశాక తమకు అనుకూలంగా రిజర్వేషన్ రాకపోతే ఎలా అని పలువురు ఆందోళన చెందుతున్నారు.



## పాలకపక్షం ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గారు: బీజేపీ నాయకులు

**అక్షరటుడే, ఇందూరు :** మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటుందనే భయంతోనే పాలకపక్షం ఓటర్ల జాబితాను తారుమారు చేసిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఆరోపించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ దిలీప్ కుమార్‌తో మంగళవారం భేటీ అయ్యారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో చోటు చేసుకున్న అక్రమాలు, పొరపాట్లపై చర్చించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలో గల ఒక వార్డులోని ఓటర్లను కావాలనే మరో వార్డులోకి మార్చారని.. అర్హులైన వేలాదిమంది ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని ఆరోపించారు. స్థానిక అధికార ప్రతినిధి కనుసైగల్లోనే అధికారులపై ఒత్తిడి తెచ్చి ముసాయిదాను తయారు చేయించాలని విమర్శించారు. ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని సర్వేలు చెబుతుండడంతో ఓటమి భయంతో అధికార పార్టీ అడ్డదారులు తొక్కుతోందని విమర్శించారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తప్పులను సరిదిద్దాలని తెలిపారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని చెప్పారు.

## మాతాశిశువుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



**అక్షరటుడే, కోటగిరి:** మాతాశిశువుల ఆరోగ్యంపై పీహెచ్‌సీ సిబ్బంది దృష్టి పెట్టాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పేర్కొన్నారు. ఈ మేరకు పోతంగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాతా, శిశు ఆరోగ్యం, క్షయ (టీబీ), రోగనిరోధక టీకాల కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం దోమలెడ్గి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. సూపర్ వైజర్ సావిత్రితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అసంక్రమిత వ్యాధులు ప్రబలకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్, డాక్టర్ జయప్రకాష్, ఎంఎల్ హెచ్‌పీ మీర్జా, ఏఎన్‌ఎంలు సవిత, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

## అధునాతన వసతులతో యంగ్ ఇండియా పాఠశాలలు: కలెక్టర్



**అక్షరటుడే, ఆర్మూర్:** రాష్ట్ర ప్రభుత్వం అధునాతన వసతులతో యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ మేరకు ఆర్మూర్ శివారులోని పిప్రి రోడ్డులో ప్రభుత్వం స్థలంతో పాటు, అంకాపూర్ శివారులోని స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి సందర్శించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి అనువైన పరిస్థితులు, అనుకూల వాతావరణం, రవాణా సదుపాయం, విద్యార్థులకు భద్రతను దృష్టిలో ఉంచుకుని స్థలాలను పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నేల స్వభావం తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ ఒకే సముదాయంలో అన్ని అధునాతన సౌకర్యాలతో భవనాలు నిర్మించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో అందరికీ ఆదర్శంగా నిలిచేలా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోందన్నారు. ఇప్పటికే మంజూరైన ఆయా నియోజకవర్గాల్లో వీటి నిర్మాణాలు ప్రారంభయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఆమె వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగం సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.



## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం అందజేశారు. ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాన్సువాడ, బీర్కూర్ మండలాలకు చెందిన మొత్తం 96 మంది లబ్ధిదారులకు రూ.96,11,136 చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జంగం గంగాధర్, నార్ల సురేష్, ఎజాజ్, నందకిషోర్, గోపాల్ రెడ్డి, లింగం, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



## ఎల్లారెడ్డిలో అలరించిన రంగవల్లులు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులపోటీలకు విశేష స్పందన లభించింది. మాజీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్ నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎల్లారెడ్డి బస్ డిపో ప్రాంగణంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందల మంది మహిళలు తరలివచ్చారు. ముగ్గులు వేసేందుకు మహిళలు పోటీపడ్డారు. కులమతాలకు అతీతంగా మహిళలు పాల్గొని ముగ్గులను వేశారు. సంక్రాంతి కళను ఉట్టిపడేలా వివిధ డిజైన్లలో వేసిన ముగ్గులు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు తానాజీరావు, నర్సింలు, సతీష్, అర్వింద్, పృథ్వీ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ‘అరైవ్ అలైవ్’ ఉద్యమంలా సాగాలి: ఎస్పీ రాజేష్ చంద్ర




**అక్షరటుడే, కామారెడ్డి :** ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమం నినాదంలా కాకుండా రోడ్డు ప్రమాదాలను నివారించే ఉద్యమంలా సాగాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ చేపట్టిన ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమాన్ని మంగళవారం కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామంలో ఎస్పీ రాజేష్ చంద్ర ప్రారంభించారు. జనవరి 13 నుంచి 24 వరకు జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమాలు జరుగుతాయని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా లో ఉగ్రవాయి గ్రామంలోనే ఈ మహత్తర కార్యక్రమం ప్రారంభించడానికి కారణం ఉందన్నారు. ఉగ్రవాయి గ్రామస్థులు 11 నెలలుగా ఒక్క రోడ్డు ప్రమాద మరణం జరగకుండా జాగ్రత్తలు తీసుకొని స్ఫూర్తిదాతలుగా నిలిచారన్నారు. రోడ్డు ప్రమాదాలు యాదృచ్ఛికాలు కావని, అవి వాహనదారుల నిర్లక్ష్యం కారణంగానే జరుగుతున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం అనేది కేవలం చలానాల నుంచి, చట్టం నుంచి తప్పించుకోవడానికి కాదని, అది ప్రాణాన్ని కాపాడే ఆయుధమన్నారు. ఈ విషయాన్ని ప్రతిఒక్క వాహనదారుడు గ్రహించి విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చే బాధ్యతను గుర్తుంచుకోవాలని, మొబైల్ వాడకం, ఓవర్ స్పీడ్, రాంగ్ దిశలో డ్రైవింగ్ ఎట్టి పరిస్థితుల్లో చేయవద్దని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రంజిత్ గౌడ్ పాల్గొన్నారు.

## ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేయడంలో పోలీసులదే కీలకపాత్ర: సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం :** రాబోయే మున్సిపల్ ఎన్నికలను శాంతియుత, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో పోలీసులదే కీలక పాత్ర అని సీపీ సాయి చైతన్య అన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సీపీ పోలీసులు అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో ఎటువంటి రాజకీయ ప్రలోభాలకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి, సిబ్బంది ఎన్నికల కోడ్‌ను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ముందస్తు చర్యలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా చూడాలని చెప్పారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలని సిబ్బందికి సీపీ సూచించారు. సోషల్ మీడియా ద్వారా వ్యాపించే వదంతులను నియంత్రించడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతల పరిరక్షణే మన ప్రధాన లక్ష్యం కావాలని పేర్కొన్నారు. ప్రతి అధికారి తన బాధ్యతను పూర్తిగా అర్థం చేసుకుని, సమన్వయంతో, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా, పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచేలా మనం అందరం కలిసికట్టుగా పని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డీసీపీ (అడ్మిన్) బి.బస్వారెడ్డి, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్ ఏసీపీలు రాజా వెంకటరెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆర్.అంజయ్య, ఎలక్షన్స్ సెల్ ఇన్‌స్పెక్టర్ వీరయ్య, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## ‘అమ్మకు అక్షరాభ్యాసం’లో భాగంగా మహిళలకు శిక్షణ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ‘అమ్మకు అక్షరాభ్యాసం’లో భాగంగా మంగళవారం శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. మండల సమాఖ్య కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సంఘం అధ్యక్షులకు గ్రామ సంఘ సహాయకులు, స్వయం సహాయక సంఘాల్లోని మహిళలందరూ కూడా అక్షరం తెలిసి ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఆర్పీలు దుర్గ, సంగీత, ఏపీఎంలు రామాయణ గౌడ్ మహిళలకు శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘంలోని ప్రతి మహిళకు చదువు వచ్చి ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. సీసీలు దత్తు, రమేష్, నారాయణ, రషీద్, రవి అకౌంటెంట్ రాజు, ఆపరేటర్ రవి తదితరులు పాల్గొన్నారు.




## ప్రజలపై విద్యుత్ భారం పడకుండా ప్రభుత్వం చర్యలు

**అక్షరటుడే ఎల్లారెడ్డి:** తెలంగాణలో పేదవారిపై విద్యుత్ భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఎల్లారెడ్డి మండలంలో ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్‌కు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేందుకు మేమున్నామంటూ లైన్‌మన్లు, జేఎల్‌ఎంలు ఇంటింటికీ తిరుగుతూ విద్యుత్‌శాఖ అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. పేదవారికి ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వమే 200 యూనిట్ల వరకు భారాన్ని భరిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

**ఆర్మూర్ నియోజకవర్గం వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఇక్కడి వ్యవసాయదారులు నిజాంసాగర్ కెనాల్ ఆయకట్టుపై ఆధారపడి వ్యవసాయం సాగిస్తుంటారు. నిజాంసాగర్ కెనాల్ ద్వారా వచ్చే నీరే ఇక్కడి పంటలకు ఆయువు. నిజాం కాలంలో నిర్మించిన ఈ కెనాల్ ప్రస్తుతం పూడిక, వ్యర్థ పదార్థాలు, పిచ్చి మొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయింది. ఈ కెనాల్ ఆధునీకరణకు రూ. 1,500 కోట్లు కేటాయించాలని ఇటీవల ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఇటీవల అసెంబ్లీలో కోరడంతో ఈ సమస్య తాజాగా తెరపైకి వచ్చింది.** – అక్షరటుడే, ఆర్మూర్

# కెనాల్‌ను ఆక్రమించేశారు..



- అధ్వానంగా మారిన నిజాంసాగర్ కాలువ
- ముళ్లపొదలు, వ్యర్థ పదార్థాలు
- చివరి ఆయకట్టుకు చేరని నీరు
- ఆధునీకరణకు రూ.1,500 కోట్లు అవసరం
- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి



జిల్లాలో నిజాంసాగర్ కెనాల్ నిజాంసాగర్ నుంచి ఆర్మూర్ ఫత్తేపూర్ వరకు 180 కి.మీ ఉంది. అయితే ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలో సుమారు 10కి.మీ మేర కెనాల్ విస్తరించి ఉంది. అయితే నిజాంసాగర్ కెనాల్ రెండువైపులా ఆక్రమణలకు గురైంది. దీంతో కెనాల్ ద్వారా నీరు వదిలినప్పుడు నీరు చివరి ఆయకట్టు వరకు చేరడం కష్టసాధ్యంగా మారింది. మరోవైపు ఆర్మూర్ పట్టణంలో నిజాంసాగర్ కెనాల్ పొడవున వ్యర్థ్యాలను తీసుకొచ్చి కెనాల్‌లో పడేయడంతో కెనాల్ అంతా దుర్గంధంతో అధ్వానంగా మారింది.

### కెనాల్ పొడవునా ఆక్రమణలు..

ఆర్మూర్ ప్రాంతంలో నిజాంసాగర్ కెనాల్ బౌండరీకి రెండువైపులా ఆక్రమణలకు గురైంది. పేదలతో పాటు బడాబాబులు సైతం కెనాల్ బౌండరీని ఆక్రమిస్తూ భారీ నిర్మాణాలు చేపట్టారు. ఆక్రమణల ఫలితంగా గతంలో పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ వద్ద నిజాంసాగర్ కెనాల్ కట్టతెగి అక్కడి ఇళ్లలోకి నీరు చేరాయి. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామ శివారు నుండి మొదలుకొని ఆర్మూర్ పట్టణంలోని వడ్డెర కాలనీ వరకు కెనాల్ పొడవునా భారీ నిర్మాణాలు వెలిశాయి. ఆర్మూర్ అంబేడ్కర్ చౌరస్తాలో ప్రాంతంలోనైతే కెనాల్ బౌండరీని ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మరికొందరైతే ఏకంగా దుకాణాలు నిర్మించి వాటిని అద్దెకు ఇచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారు.

### నిజాంసాగర్ కాలువను ఆధునీకరించాలి

నిజాంసాగర్ కెనాల్ ఆధునీకరణకు రూ.1,500 కోట్లు కేటాయించాలని ఆర్మూర్ శాసనసభ్యుడు పైడి రాకేష్ రెడ్డి కోరారు. ఈనెల 3న అసెంబ్లీ సమావేశాలలో నిజాంసాగర్ కెనాల్ ఆధునీకరణపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. నిజాంసాగర్‌కు ఆధునీకరణ, పాత బకాయిలు, మోటార్ల ఏర్పాటు విషయమై గత రెండేళ్లుగా నీటిపారుదల శాఖ మంత్రిని 20 సార్లు కలిశానని.. ఆయన నవ్వుకుంటూ సమస్యను గాలికి వదిలేశారని సభాపక్షంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం నిజాంలు నిర్మించిన నిజాంసాగర్ కాలువ పూడికతో అధ్వానంగా మారిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంతోపాటు ప్రత్యేక రాష్ట్రంలోనూ నష్టపోయిన జిల్లా ఏదైనా ఉందంటే అది కేవలం నిజామాబాద్ జిల్లానేనని ఆయన అసెంబ్లీలో ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ ఆధారిత జిల్లా అయిన నిజామాబాద్‌పై సీఎం, మంత్రులు దయ చూపించాలన్నారు. మదనపల్లి నుంచి ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ వరకు నిజాంసాగర్ కెనాలను పునరుద్ధరించాలని ఇందుకు రూ.1,500 కోట్లు కేటాయించాలని ఆయన కోరారు.



## స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని పోతాయిపల్లి గ్రామానికి చెందిన సంఘ గౌడ్ కుమార్తె అద్విక అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో సంఘ గౌడ్ చిన్ననాటి స్నేహితులు మంగళవారం ఆయనకు ఆర్థికసాయం అందజేశారు. లింగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001-02 పదో తరగతిలో వీరంతా ఒకేచోట చదువుకున్నారు. దీంతో స్నేహితులంతా స్పందించి రూ.52,600 సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బాలకిషన్, కాశీరాం, శంకర్, అల్లూరి గౌడ్, చరణ్, అంజయ్య, రామచందర్, సాయిలు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## క్యాలెండర్ ఆవిష్కరణ

**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని పోల్కంపేట పంచాయతీ క్యాలెండర్‌ను మంగళవారం సర్పంచ్ దివిటి రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ అభివృద్ధికి పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లత, వార్డు సభ్యులు నరేష్, చంద్రయ్య, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనతికాలంలోనే ‘అక్షరటుడే’కు ప్రజల్లో ఆదరణ




**అక్షరటుడే, కామారెడ్డి:** అనతికాలంలోనే ‘అక్షరటుడే’ ప్రజల్లో ఆదరణ పొందిందని కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి అన్నారు. సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో మంగళవారం ‘అక్షరటుడే’ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిజిటల్ మీడియాలో శరవేగంగా దూసుకుపోతున్న ‘అక్షరటుడే’ పాఠకులను మరింత చైతన్యపరుస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర విశేషమైందని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో ‘అక్షరటుడే’ కామారెడ్డి డివిజన్ ఇన్‌ఛార్జి వడ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తున్న ‘అక్షరటుడే’

**అక్షరటుడే, బోధన్ :** డిజిటల్ మీడియా రంగంలో ‘అక్షరటుడే’ దూసుకెళ్తుందని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ‘అక్షరటుడే’ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ మీడియా రంగంలో అందరికంటే ముందుగా వార్తలనందిస్తూ ‘అక్షరటుడే’ దినపత్రిక ప్రత్యేకంగా నిలుస్తోందన్నారు. నిష్పక్షపాతంగా ఖచ్చితమైన సమాచారంతో వేగంగా వార్తలను అందిస్తున్న ‘అక్షరటుడే’ యాజమాన్యానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ టౌన్ సీఐ వెంకట్ నారాయణ, ఎస్సై భాస్కరాచారి, ‘అక్షరటుడే’ బోధన్ ప్రతినిధి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా భవనం కోసం స్థలం అందజేత



**అక్షరటుడే, బాల్కొండ:** కిసాన్ నగర్‌లో మూడో ఇందిరమ్మ మహిళా భవనం కోసం కావాల్సిన స్థలాన్ని మంగళవారం స్థానికులు అధికారులకు చూపించారు. ఈ మేరకు మహిళా సమాఖ్య ద్వారా మంజూరైన రూ.10లక్షలతో మహిళా భవనాన్ని నిర్మించనున్నారు. ఉచితంగా ప్రైవేటు స్థలాన్ని సమకూర్చడంలో సహకరించిన మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ జ్ఞాన సాగర్ రెడ్డిలను మహిళా సభ్యులు సన్మానించారు. సర్పంచ్ రామరాజు గౌడ్, ఉప సర్పంచ్ స్వామి,ఏపీఎం గంగారాం, సీసీ జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత బలవన్మరణం..

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్ :** మండలంలోని కాటేపల్లికి చెందిన వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సోం పేట్ తులసి (25) తన భర్త రాందాస్ వేధింపులు భరించలేక సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఏడాది కాలంగా భర్త ఆమెతో తరచూ గొడవ పడుతుండేవాడని.. దీంతో ఆమె మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకొందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై అరుణ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకున్నారు. మృతురాలి తల్లి రుక్కవ్వ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అయ్యప్ప తిరువాభరణ సేవలో కామారెడ్డి జిల్లావాసులు



**అక్షరటుడే, కామారెడ్డి:** శబరిమల అయ్యప్ప స్వామికి అలంకరించే తిరువాభరణ సేవలో కామారెడ్డి జిల్లా వాసులకు అవకాశం లభించింది. జిల్లాలోని గాంధారికి చెందిన కులకర్ణి చక్రధర్, అంజాగౌడ్ స్వామి, కొక్కొండ మహేశ్వర్, రాజేశ్వర్ లకు తిరువాభరణ సేవలో పాల్గొనే అదృష్టం వరించింది. ప్రతి ఏడాది జనవరి 12 నుంచి 14 వరకు తిరువాభరణ పాదయాత్ర కొనసాగుతుంది. సంక్రాంతి రోజు శబరిమల అయ్యప్ప మకర సంక్రాంతి రోజు మూడుసార్లు జ్యోతి రూపంలో దర్శనం ఇస్తారు. పాదయాత్రలో పందల రాజ వంశీయులతో పాటు ప్రతి ఏడాది కొందరికి అవకాశం కల్పించడం ఆనవాయితీగా వస్తోంది. దేశవ్యాప్తంగా వేలాదిగా దరఖాస్తులు రాగా అందులో కామారెడ్డి శ్రీశాస్త అన్నదాన ట్రస్ట్ సభ్యులైన నలుగురికి అదృష్టం వరించింది.

## బాల్కొండలో పతంగుల దుకాణాల తనిఖీ



**అక్షరటుడే,బాల్కొండ:** సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణంలోని పతంగి దుకాణాలను ఎస్సై శైలేందర్ తనిఖీ చేశారు. చైనా మంజా విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన వ్యాపారస్థులను హెచ్చరించారు. ఈ మాంజా కారణంగా మనుషులతో పాటు పక్షులకు ప్రాణాపాయం పొంచి ఉందన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి రైతు గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి



**అక్షరటుడే, లింగంపేట:** జిల్లాలోని ప్రతి రైతు గుర్తింపు కార్డుకు కోసం ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి సూచించారు. లింగంపేట రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేసే పథకాలు రావాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని అన్నారు. భవిష్యత్తులో రైతుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఉంటేనే ప్రభుత్వం పథకాలు, ప్రోత్సాహకాలు అందుతాయన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం డీకంపల్లిలో రెండు కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. గ్రామానికి చెందిన కలగడ్డ దేవాయి, భామంకర్ విజయ్ లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. వారి పరిస్థితిని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లగా ఆయన స్పందించారు. కలగడ్డ దేవాయికి రూ.20,000, భామంకర్ విజయ్ లక్ష్మికి రూ.30,000 చెక్కులను మంజూరు చేయించగా స్థానిక నాయకులు బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పడమటి ప్రవీణ్, కలగడ్డ వినోద్, వివేక్ అజయ్, మణిరాజ్, అశోక్, స్నేహిత్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.





## గృహజ్యోతి పథకం సర్టిఫికెట్ల పంపిణీ

**అక్షరటుడే, మెండోరా:** తెలంగాణ రైసింగ్‌లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తోందని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం లబ్ధిదారులకు గృహజ్యోతి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో రమేష్, చందు, సర్పంచ్ మాధురి రాజు, ఉపసర్పంచ్ సంపంగి సతీష్, మిస్త్రా, నవీన్ గౌడ్ లైన్‌మన్ కిషోర్ పాల్గొన్నారు.



బోధన్‌లో..



కమ్మర్‌పల్లిలో..




మెండోరాలో..

## రోడ్డు ప్రమాదాల నివారణకు ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమం

**రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ‘అరైవ్ అలైవ్’ పేరుతో కార్యక్రమాన్ని చేపట్టిందని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో మంగళవారం పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.** – అక్షరటుడే, నెట్‌వర్క్



నాగిరెడ్డి పేట్ మండల కేంద్రంలో...